

సాగర్ చెంతకు కృష్ణమ్మ పరవళ్లు

- నాగార్జునసాగర్‌కు లక్షన్నర క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

శ్రీశైలం డ్యాం నుంచి కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతూ సాగర్ చెంతకు చేరుకుంటోంది. మంగళవారం మధ్యాహ్నం ప్రాజెక్టు నాలుగు క్రస్ట్ గేట్లను ఎపి సిఎం చంద్రబాబు నాయుడు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. దాంతో సుమారు లక్షా50వేల క్యూసెక్కుల నీరు నాగార్జునసాగర్ జలాశయంలోకి వస్తోంది. శ్రీశైలం నుంచి 110 కిలోమీటర్లు సుమారు ఎనిమిది గంటలపాటు కృష్ణమ్మ ప్రయాణం చేసి మంగళవారం రాత్రి 10గంటలకు సాగర్ జలాశయానికి చేరుకుంది. దాంతో సాగర్ జలాశయం నీటిమట్టం గణనీయంగా పెరుగుతోంది. శ్రీశైలం డ్యాం నాలుగు క్రస్ట్ గేట్ల ద్వారా 1,06,976 క్యూసెక్కులు, విద్యుత్ ఉత్పత్తి ద్వారా 35,315 క్యూసెక్కులు మొత్తంగా 1,42,291 క్యూసెక్కులు సాగర్ జలాశయానికి చేరుతోంది.

882 అడుగులకు శ్రీశైలం నీటిమట్టం

ఎగువ నుంచి జూరాల ప్రాజెక్టు ద్వారా 94710 క్యూసెక్కులు, విద్యుత్ ఉత్పత్తి ద్వారా 2914 క్యూసెక్కులు, సుంకేసుల ప్రాజెక్టు నుంచి 62,064 క్యూసెక్కులు, వాగులు, వంకల ద్వారా 8,318 క్యూసెక్కులు మొత్తంగా 1,94,2006 క్యూసెక్కుల నీరు శ్రీశైలం ప్రాజెక్టులోకి వస్తోంది. శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులకుగాను 882 అడుగులుగా ఉంది. నాగార్జునసాగర్ జలాశయంలో పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులకుగాను 533 అడుగులకు పెరిగింది. సాగర్ ఎడమ కాలువ ద్వారా 3090 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బిసి ద్వారా 1500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి భారీగా వరద వస్తున్నందున నాగార్జునసాగర్ డ్యాం అధికారులను, సిబ్బందిని అప్రమత్తం చేసినట్టు ఇన్‌చార్జి ఎస్ఈ మల్లికార్జునరావు తెలిపారు.



డ్యాంను సందర్శిస్తున్న 24 దేశాల ప్రతినిధులు

సాగర్‌ను సందర్శించిన 24 దేశాల ప్రతినిధులు

- డ్యాం, విద్యుత్ కేంద్రం పరిశీలన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అంతర్జాతీయ పర్యాటక కేంద్రం, బహుళార్థక సాధక ప్రాజెక్టు అయిన నల్లగొండ జిల్లాలోని నాగార్జునసాగర్‌ను మంగళవారం 24దేశాల పర్యావరణ ప్రతినిధులు సందర్శించారు. ఆసియా, ఆఫ్రికా, ఆస్ట్రేలియా ఖండాల నుంచి స్విట్జర్లాండ్, భూటాన్, ఈజిప్టు, ఎథోపియా, కాంగో, ఫిజీ, గాంబియా, లైబేరియా, మయన్మార్, నేపాల్, నైజీరియా, సౌత్ సుడాన్, టాంజినియా, యుగాండా, జింబాబ్వే మొదలగు 24 దేశాలకు చెందిన ప్రతినిధులకు హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఎన్విరాన్‌మెంట్ ప్రొటక్షన్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూషన్ సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ ఇస్తున్నారు. ప్రాజెక్టుల అభివృద్ధి- పర్యావరణం, సామాజిక ప్రభావం అనే అంశంపై 14 రోజులుగా శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు నాగార్జునసాగర్ ప్రాజెక్టును ప్రతినిధులు సందర్శించారు. ప్రాజెక్టు, ప్రధాన జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం గురించి సంబంధిత అధికారులు వారికి వివరించారు. వారి వెంట సాగర్ సీఐ శ్రీను నాయక్, ఎస్‌పీఎఫ్ రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాసరావు నాయుడు, సాగర్ డ్యాం అసిస్టెంట్ ఇంజినీర్ కృష్ణయ్య, విజయపురి ఎస్ఐ ముత్తయ్య, ఎస్‌పీఎఫ్ ఎస్ఐ రఘు తదితరులు ఉన్నారు.

ఆగస్టు 13న వికలాంగుల చలో హైదరాబాద్

- మద్దతునివ్వాలని కోరిన మందకృష్ణ మాదిగ
- సంపూర్ణ మద్దతు : సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వికలాంగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ వచ్చేనెల 13న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు వికలాంగుల హక్కుల పోరాట సమితి (విహెచ్‌పిఎస్) వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ ప్రకటించారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఎంబి భవన్‌లో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీని మందకృష్ణ కలిశారు. పలు అంశాలపై చర్చించారు. వికలాంగుల పోరాటానికి మద్దతునివ్వాలని కోరారు. ఈ సందర్భంగా తనను కలిసిన విలేకర్లతో జాన్‌వెస్లీ మాట్లాడుతూ వికలాంగులకు ఎన్నికల మ్యానిఫెస్టోలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. వికలాంగుల పెన్షన్ రూ.ఆరు వేలు, ఆసరా పెన్షన్ రూ.నాలుగు వేలకు పెంచాలని కోరారు. 18 నెలలు గడిచినా రాష్ట్ర ప్రభుత్వం వాటిపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదన్నారు. ఆగస్టు 13న విహెచ్‌పిఎస్ ఆధ్వర్యంలో తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమానికి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఇచ్చిన హామీల అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని చెప్పారు. వికలాంగుల ఉద్యమానికి అండగా ఉంటామని అన్నారు.

తీవ్ర వైకల్యం ఉన్న వికలాంగుల పెన్షన్ రూ.15 వేలు ఇవ్వాలి : మందకృష్ణ

వికలాంగులు, ఆసరా పెన్షన్‌దారులకు కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని మందకృష్ణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వికలాంగుల పెన్షన్ రూ.ఆరు వేలు, ఆసరా పెన్షన్ రూ.నాలుగు వేలకు పెంచుతామంటూ హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. తీవ్ర వైకల్యం (ఇతరుల సహాయం అవసరమైన వారు) ఉన్న వారికి పెన్షన్ రూ.15 వేలు ఇవ్వాలని కోరారు. దరఖాస్తు చేసుకున్న కొత్త పెన్షన్‌దారులందరికీ దరఖాస్తు చేసుకున్న తేదీ నుంచి మంజూరు చేయాలని చెప్పారు. ఎఐసిసి ఎన్నికల హామీ ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికల్లో వికలాంగులకు వెంటనే రాజకీయ రిజర్వేషన్‌ను ప్రకటిస్తూ చట్ట సవరణ లేదా ఆర్డినెన్స్ ద్వారానైనా అమలు చేయాలని సూచించారు. వికలాంగులకు ఆర్‌టిసి బస్సుల్లో ఉచిత రవాణా సౌకర్యం కల్పించాలని వివరించారు. ప్రతి వికలాంగునికీ రూ.50 లక్షల ఆరోగ్య భద్రత బీమా కార్డులివ్వాలని కోరారు. వికలాంగులకు ఇంటిస్థలం కేటాయించాలనీ, అనుకూలమైన వాతావరణంలో ఇండ్లు నిర్మించి ఇవ్వాలని అన్నారు. ఉపాధి హామీ చట్టంలో పనిదినాలను 150 నుంచి 200లకు కల్పించి తేలికపాటి పనులను వారికివ్వాలని చెప్పారు. వికలాంగుల వివాహ ప్రోత్సాహక బహుమతులు రూ.ఐదు లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. వారి పిల్లలకు కార్పొరేట్ విద్యాసంస్థల్లో నాలుగు శాతం రిజర్వేషన్ కల్పించాలని వివరించారు. వివాహంతో సంబంధం లేకుండా అంత్యోదయ కార్డు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బండారు రవికుమార్, రంగారెడ్డి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి జగదీశ్, నాయకులు కోట రమేష్, విహెచ్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు రాంబాబు, చైర్మన్ ఎల్ గోపాల్, జాతీయ కోర్ కమిటీ వైస్ చైర్మన్లు కొల్లి నాగేశ్వర్‌రావు, అందె రాంబాబు, ముసాయిదా కమిటీ వైస్ చైర్మన్ చెరుకు నాగభూషణం, జాతీయ నాయులు వంశరాజ్ రాంచందర్, రాష్ట్ర నాయకులు వేణుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి సమ్మెకు ఉద్యోగ జెఎసి మద్దతు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో


కేంద్ర, రాష్ట్ర, ఇతర కార్మిక సంఘాలు బుధవారం తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు తెలంగాణ ఉద్యోగ జెఎసి సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ మేరకు జెఎసి చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కార్మికులు, ఉద్యోగుల ప్రయోజనాలకు హానికరంగా ఉన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధివిధానాలకు వ్యతిరేకంగా నిరసన తెలపాలని కోరారు. ఉద్యోగులకు ఆర్థిక భద్రత కల్పించాలనీ, రాయితీలు, సంక్షేమం, హక్కులకు భంగం కలగకుండా విధానాలున్నాయని తెలిపారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సిపిఎస్), ఏకీకృత పెన్షన్ పథకం (యుపిఎస్)కు వ్యతిరేకంగా ఏప్రిల్ ఐదున ఉద్యోగ జెఎసి కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించామని పేర్కొన్నారు. కార్మికుల సమ్మెలో ఉద్యోగులు కలిసి నడవాలని కోరారు. సమ్మెకు సంఘీభావంగా బుధవారం హైదరాబాద్‌లోని నాంపల్లి అమర వీరుల స్థూపం (గన్‌పార్క్) వద్ద మధ్యాహ్నం ఒంటిగంటకు ఉద్యోగులతో నిరసన ప్రదర్శనను నిర్వహిస్తామని తెలిపారు. జంటనగరాల్లోని ఉద్యోగులు పెద్దఎత్తున పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు.

యూరియా సకాలంలో సరఫరా చేయండి

- దేశీయంగా ఉత్పత్తి అయిన యూరియా కోటా పెంచండి..
- కేంద్ర మంత్రి నడ్డాకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వినతి

ప్రజాశక్తి హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్ర అవసరాలకు కేటాయించిన యూరియాను సకాలంలో సరఫరా చేయాలని కేంద్ర ఎరువులు, రసాయనాల శాఖ మంత్రి జెపి నడ్డాకు ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రిని ఢిల్లీలోని ఆయన అధికారిక నివాసంలో సిఎం మంగళవారం కలిశారు. వానా కాలం సీజన్‌కు సంబంధించి ఏప్రిల్-జూన్ నెలల మధ్య ఐదు లక్షల మెట్రిక్ టన్నులకుగానూ కేవలం 3.07 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే సరఫరా చేశారని కేంద్ర మంత్రి దృష్టికి సిఎం తీసుకెళ్లారు. రాష్ట్రంలో ప్రాజెక్టులకు నీరు రావడం.. సాగు పనులు జోరుగా సాగుతున్నందున యూరియా సరఫరాలో ఆటంకాలు తలెత్తకుండా చూడాలని కోరారు. జులై నెలకు సంబంధించి 63 వేల మెట్రిక్ టన్నులు దేశీయంగా ఉత్పత్తి అయిన యూరియా, 97 వేల మెట్రిక్ టన్నుల విదేశాల నుంచి దిగుమతి చేసుకున్న యూరియా రాష్ట్రానికి సరఫరా చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు కేవలం 29 వేల మెట్రిక్ టన్నుల యూరియా మాత్రమే చేశారని కేంద్ర మంత్రికి సిఎం తెలిపారు. దేశీయంగా ఉత్పత్తి అవుతున్న యూరియా కోటాను తెలంగాణకు పెంచాలని సీఎం కోరారు. యూరియా సరఫరాకు సంబంధించి రైల్వే శాఖ తగిన రేక్‌లు కేటాయించడం లేదని... వాటి సంఖ్య పెంచాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ క్రీడా సలహాదారు ఏపీ జితేందర్ రెడ్డి, ఎంపీలు డాక్టర్ మల్లు రవి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు, కేంద్ర పథకాల సమన్వయ కార్యదర్శి డాక్టర్ గౌరవ్ ఉప్పల్ తదితరులు పాల్గొన్నారు.



కేంద్ర మంత్రి నడ్డాతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

జహీరాబాద్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ అభివద్ధికి సహకరించండి..

వరంగల్ విమానాశ్రయానికి ఆర్థిక సహాయం చేయండి...
కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వినతి

జహీరాబాద్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ అభివద్ధికి సహకరించాలని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్‌కు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలోని వాణిజ్య భవన్‌లో కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌తో సీఎం రేవంత్ రెడ్డి మంగళవారం భేటీ అయ్యారు. జహీరాబాద్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ అభివద్ధికి జాతీయ పారిశ్రామిక కారిడార్ అభివద్ధి, అమలు ట్రస్ట్ ఆమోదించిన రూ.596.61 కోట్లను త్వరగా విడుదల చేయాలని కేంద్ర మంత్రిని ముఖ్యమంత్రి కోరారు. స్మార్ట్ సిటీకి అవసరమైన నీటి సరఫరా, విద్యుత్, ఇతర వసతుల కల్పనకు ఆర్థిక సహాయం చేయాలని కేంద్ర మంత్రికి సిఎం విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్-వరంగల్ పారిశ్రామిక కారిడార్‌లో భాగంగా వరంగల్ విమానాశ్రయానికి నిధులు మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని సిఎం అభ్యర్థించారు. హైదరాబాద్-విజయవాడ పారిశ్రామిక కారిడార్ ఫీజుబిలిటీని అధ్యయనం చేస్తున్నట్లు కేంద్ర మంత్రి దష్టికి సీఎం తీసుకెళ్లారు. తెలంగాణ ప్రభుత్వం ఆదిభట్లలో అత్యున్నతమైన మౌలిక వసతులతో ప్రత్యేకమైన రక్షణ, ఏరోస్పేస్ పార్కును ఏర్పాటు చేసిందని... ఈ నేపథ్యంలో హైదరాబాద్-బెంగళూర్ పారిశ్రామిక కారిడార్‌ను ఏరో-డిఫెన్స్ కారిడార్‌గా మంజూరు చేయాలని కేంద్ర మంత్రి గోయల్‌కు సిఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. పెట్టుబడులకు సిద్ధంగా ఉన్న వంద ప్లగ్ అండ్ ప్లే పారిశ్రామిక పార్కుల అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలు సమర్పిస్తామని, కేంద్ర ప్రభుత్వం వాటికి మద్దతుగా నిలవాలని కేంద్ర మంత్రిని సిఎం కోరారు. సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (క్రీడలు) ఎపి జితేందర్ రెడ్డి, ఎంపిలు డాక్టర్ మల్లు రవి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, కేంద్ర పథకాల సమన్వయ కార్యదర్శి డాక్టర్ గౌరవ్ ఉప్పల్ తదితరులు పాల్గొన్నారు.

కెటిఆర్.. నిజాలు తెలుసుకొని మాట్లాడు

- మంత్రి సీతక్క

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

"మేం సమ్మక్క, సారలమ్మ వారసులం.. ఆదివాసీ బిడ్డ జోలికి వస్తే నాశనమైపోతావ్ కెటిఆర్" అని మంత్రి సీతక్క వ్యాఖ్యానించారు. ములుగు నియోజకవర్గంలో నిజాలు తెలుసుకొని మాట్లాడాలని అన్నారు. మంగళవారం ములుగు జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. సిఎం రేవంత్‌రెడ్డి పట్ల ఇష్టారాజ్యంగా మాట్లాడటం తగదని హెచ్చరించారు. ములుగులో ప్రజాపాలన, ఇందిరమ్మ పాలన సాగుతోందన్నారు. కెటిఆర్ దొర అహంకారం తగ్గించుకోవాలని, కుల, ధన బలం ఉండొచ్చని, కానీ తనకు నియోజకవర్గ ప్రజలబలముందనితెలిపారు. ములుగు నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి బిఆర్ఎస్ ఓర్వలేకపోతున్నదని విమర్శించారు. బిఆర్ఎస్ పదేండ్ల పాలనలో ఇచ్చిన హామీలు, నెరవేర్చిన హామీలు, ఇచ్చిన ఇండ్లు ఎన్నో లెక్క చూసుకొని రావాలని సవాల్ విసిరారు. కెటిఆర్ మిడుతల దండుతో ములుగుపై పడ్డాడని, ఓడిపోయిన నాయకులు ములుగు వచ్చి డ్రామాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం చనిపోయిన వారి ఇంటికి వెళ్లి పరామర్శించని వారు రోడ్లపై డ్రామాలు చేయడం సిగ్గు చేటని అన్నారు. పోలీసులు శాంతియుత ధర్నాకు అనుమతిస్తే కాన్వాయ్‌ని అడ్డుకోవాలని కుట్ర చేశారని అన్నారు. జులై 6 వరకు బిఆర్ఎస్ కార్యకర్తలపై పెట్టిన కేసులు ఎన్ని, మీ పాలనలో కాంగ్రెస్ కార్యకర్తలపై పెట్టిన కేసులు ఎన్నో తెలపాలన్నారు. దుబాయ్ వేదికగా బిఆర్ఎస్ సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్న అబద్ధాలను మానుకోవాలని హితవు పలికారు. ములుగు నియోజకవర్గంలో సీడ్‌తో నష్టపోయిన 950మందికి కంపెనీల ప్రతినిధులతో రూ.4కోట్లు ఇప్పించేందుకు మంత్రి తుమ్మల, తాను వెళ్తుంటే అడ్డుకోవాలని చూశారని ఆరోపించారు. బుట్టాయిగూడెం, చల్వాయిలో చనిపోయిన వారు ఎందుకు చనిపోయారో ముందు కారణాలు తెలుసుకోవాలని అన్నారు. సిరిసిల్లలో ఇసుక లారీలతో తొక్కించి చంపింది, అడ్వకేట్లను చంపింది ఎవరో తెలియదా అనిప్రశ్నించారు. 70ఏండ్ల చరిత్రలో పంచాయతీరాజ్ శాఖకు ఒక కోయ ఆడబిడ్డ మంత్రిగా ఉంటే అక్కసు వెళ్లగక్కుతున్నారనీ, తనకు ఒక్క అవకాశం వస్తే ఓర్చుకోలేవా కేటీఆర్ అని అన్నారు. ఎన్నికల కోసం డ్రామాలడటం బిఆర్ఎస్‌కు తగదని తెలిపారు.

మైక్ కట్ చేయబోమంటే అసెంబ్లీలో చర్చకు సిద్ధం

- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సవాల్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మైక్ కట్ చేయబోమంటే గోదావరి, కృష్ణా జలాలతో పాటు అన్ని సమస్యలపై అసెంబ్లీలో చర్చించేందుకు సిద్ధమని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ప్రభుత్వానికి సవాల్ విసిరారు. మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ పని తీరుపై విమర్శలు గుప్పించారు. ఎక్కడైనా ప్రతిపక్షం సలహాలు తీసుకుని ప్రభుత్వం పని చేస్తుందనీ, కాని రాష్ట్రంలో మాత్రం కాంగ్రెస్ ప్రభుత్వం బేఖాతరు చేస్తోందని ఆరోపించారు. కల్వకుర్తి లిఫ్టులను ఆన్ చేయాలని ఎప్పట్నించో బీఆర్ఎస్ అడిగితే ఈ నెలాఖరుకు ఆన్ చేస్తామన్న మంత్రి ఉత్తమ్ హడావిడిగా ఎందుకు ప్రారంభించారని ప్రశ్నించారు. ప్రభుత్వ లోపాలను సరి చేసుకోవాలని సలహాలు, సూచనలు ఇస్తున్నామే తప్ప తాము విమర్శించడం లేదని గుర్తు చేశారు. బిఆర్ఎస్ ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేక పీసీసీ అధ్యక్షులు మహేశ్‌కుమార్ గౌడ్ కేటీఆర్‌పై అసంబద్ధమైన విమర్శలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల్లో కాంగ్రెస్‌కు గెలిచే సత్తా ఉంటె ఎన్నికలు తొందరగా పెట్టాలని డిమాండ్ చేశారు. మీడియా సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు శుభ ప్రద్ పటేల్, బాలరాజు యాదవ్ పాల్గొన్నారు

ఇంటి స్థలాలు చూపే వరకు పోరాటం

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండి జహంగీర్
- నెల రోజుల్లో పరిష్కారానికి ఆర్‌డిఒ హామీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



పట్టాలు ఉన్న లబ్దిదారులందరికీ ఇండ్ల స్థలాలు ఇచ్చే వరకు పోరాటం ఆగదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండి జహంగీర్ తేల్చి చెప్పారు. యాదాద్రి భువనగిరి పట్టణంలోని సర్వేనెంబర్ 700లో పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని చేపట్టిన దీక్షలు మూడో రోజుకు చేరుకున్నాయి. అయితే, మంగళవారం తహసీల్దార్ అంజిరెడ్డి, ఇతర అధికారులు పోలీసు బలగాలతో ఆ ప్రాంతానికి చేరుకున్నారు. గుడిసెలను తొలగించేందుకు యత్నించగా లబ్దిదారులు అడ్డుకున్నారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో విషయం తెలుసుకున్న జహంగీర్, నాయకులు అక్కడికి చేరుకున్నారు. ఈ క్రమంలో అధికారులతో తీవ్ర వాగ్వాదం జరిగింది. స్థలాలు చూపే వరకు ఇక్కడి నుంచి కదిలేది లేదంటూ పెద్దఎత్తున ధర్నా చేశారు. దాంతో ఆర్‌డిఒ కృష్ణారెడ్డి నాయకులను సాయంత్రం చర్చలకు పిలిచారు. అధికారులు వెనుదిరిగి వెళ్లిపోయారు. ఈ సందర్భంగా జహంగీర్ మాట్లాడుతూ.. గుడిసెలు వేసుకున్న ప్రాంతాన్ని ఆయన పరిశీలించి వారితో మాట్లాడారు. 25 ఏళ్ల కిందట నిరుపేదలకు ఇళ్ల స్థలాల కోసం పట్టా సర్టిఫికెట్లు ఇచ్చారని, నేటికీ స్థలం చూపించకపోవడం బాధాకరమన్నారు. అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోవడంతో సిపిఎం ఆధ్వర్యంలో లబ్దిదారులు సర్వే నెం.700లోని భూమిలో గుడిసెలు వేసుకున్నారని తెలిపారు. స్థలాలు చూపించనందున ఇండ్లు కట్టుకునే పరిస్థితి లేక అప్పటి నుంచి ఒక్కో ఇంట్లో రెండు మూడు జంటలు నివాసముంటున్నాయని తెలిపారు. ఏళ్ల తరబడి అద్దె ఇంట్లో ఉంటున్నారన్నారు. స్థానిక ఎమ్మెల్యే ఈ విషయంలో చొరవ తీసుకుని ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్ సర్వేనెంబర్ 700లోని భూమిని సందర్శించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు బట్టుపల్లి అనురాధ, పట్టణ కార్యదర్శి మాయకృష్ణ, నాయకులు బర్ల వెంకటేష్ కల్లూరి నాగమణి, వల్దాసు అంజయ్య, కొత్త లక్ష్మయ్య, కొత్త లలిత, దొడ్డి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నాయకులతో ఆర్డీఓ చర్చలు

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జహంగీర్, ఇండ్ల స్థలాల సాధన కమిటీ నాయకులతో సాయంత్రం ఆర్‌డిఒ కృష్ణారెడ్డి చర్చించారు. 20 ఏళ్ల కిందట ఇచ్చిన పట్టా సర్టిఫికెట్లకు స్థలాలు చూపలేదని, వారంతా అద్దె ఇండ్లు, ఒకే ఇంట్లో రెండు మూడు కుటుంబాలు నెట్టుకొస్తున్నాయని వివరించారు. వెంటనే స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తమకు నెల రోజుల సమయం ఇవ్వాలని, ఆ లోపు సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని ఆర్‌డిఒ హామీ ఇచ్చారు.

44 మంది సీనియర్ ప్రొఫెసర్లకు అడిషనల్ డిఎంఇలుగా ఉద్యోగోన్నతి

- ఉత్తర్వులు జారీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో వివిధ మెడికల్ కాలేజీలకు పాలనాధికారులు అందుబాటులోకి వచ్చారు. అన్ని కాలేజీలు, టీచింగ్ హాస్పిటళ్లకు ప్రిన్సిపల్స్, సూపరింటెండెంట్లను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు 44 మంది సీనియర్ ప్రొఫెసర్లకు మెడికల్ ఎడ్యుకేషన్ అడిషనల్ డైరెక్టర్లుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. వారందరికీ రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రిన్సిపల్స్‌గా, టీచింగ్ హాస్పిటళ్లకు సూపరింటెండెంట్లుగా నియమించింది. దీంతో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తొలిసారిగా ప్రభుత్వ మెడికల్ కాలేజీలు, టీచింగ్ హాస్పిటళ్లకు రెగ్యులర్ పద్ధతిలో పరిపాలనాధికారులను నియామకం జరిగింది. అసోసియేట్ ప్రొఫెసర్లుగా పని చేస్తున్న 278 మందికి ప్రొఫెసర్లుగా ఉద్యోగోన్నతులు కల్పించే ప్రక్రియ చివరి దశకు వచ్చింది. ఎడిఎంఈల పోస్టింగ్ ప్రక్రియ పూర్తయిన నేపథ్యంలో ప్రొఫెసర్లుగా ప్రమోట్ అయిన వారికి కూడా ప్రభుత్వం త్వరలో పోస్టింగ్స్ ఇవ్వనున్నది. ఈ ప్రమోషన్లతో అన్ని కాలేజీల్లో ప్రొఫెసర్ల కొరత, డిపార్ట్‌మెంట్ హెచ్ఒడిల సమస్య తీరనున్నది. అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా పని చేస్తున్న సుమారు 231 మంది అసోసియేట్ ప్రొఫెసర్లుగా ప్రమోషన్లు ఇచ్చేందుకు వైద్యారోగ్యశాఖ ఇప్పటికే చర్యలు ప్రారంభించింది. అసోసియేట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్, అడిషనల్ డిఎంఈ వంటి పోస్టులను నేరుగా రిక్రూట్ చేసుకునే అవకాశం లేకపోవడంతో, ప్రమోషన్ల ద్వారా ఈ పోస్టులను భర్తీ చేస్తున్నది. 607 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను నేరుగా భర్తీ చేసేందుకు మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఇటీవలే నోటిఫికేషన్ విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఇవిగాక సుమారు మరో 714 పోస్టుల భర్తీకి ఆర్థిక శాఖ ఆమోదం తెలిపింది. ఈ పోస్టులను సైతం త్వరలోనే భర్తీ చేయనున్నారు.

అన్ని రంగాల విద్యార్థులకూ అవకాశాలు

- అంతర్జాతీయ సంబంధాలకు ప్రాధాన్యత
- కార్మికశాఖ మంత్రి డాక్టర్ వివేక్ వెంకటస్వామి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అన్ని రంగాల విద్యార్థులకు అవకాశాలు తక్కేలా అంతర్జాతీయ సంబంధాలకు ప్రాధాన్యతనిస్తున్నట్టు కార్మికశాఖ మంత్రి డాక్టర్ వివేక్ వెంకటస్వామి తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఆయన జర్మనీ ప్రభుత్వ ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ టామ్‌కామ్ ద్వారా ఇప్పటికే నర్సులకు జర్మనీలో అవకాశాలు కల్పిస్తున్నామని, అదే విధంగా ఐటిఐ తదితర రంగాలకు చెందిన విద్యార్థులకు కూడా ఇలాంటి శిక్షణ ఇచ్చేలా భవిష్యత్తులో చర్యలు తీసుకోనున్నట్టు వెల్లడించారు. జర్మనీ ప్రతినిధులతో మంత్రితో పాటు కార్మికశాఖ ముఖ్య కార్యదర్శి ఎం.దాన కిశోర్ భేటీ అయ్యారు. జర్మనీ నుంచి బైన్కా మరియా కుంజ్ తదితరులతో పాటు జీఐజడ్ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు జర్మనీ ప్రభుత్వం, తెలంగాణ ప్రభుత్వం సంయుక్తంగా చేపట్టిన ట్రిపుల్ విన్ ప్రాజెక్టు పురోగతిపై చర్చించారు. జర్మనీలో అవకాశాల కోసం ఎంపిక చేసిన నర్సింగ్ ఆఫీసర్లకు జర్మనీ భాషపై ఉచితంగా శిక్షణ ఇస్తున్న సంగతి తెలిసిందే. ఈ నెల 9 నుంచి 17 వరకు ట్రిపుల్ విన్ ప్రాజెక్టు - 2024 బ్యాచ్‌కు చెంది, జర్మనీ భాషలో శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న వారికి ఇంటర్వ్యూలు నిర్వహించనున్న సంగతి తెలిసిందే.

బ్యాండు కళాకారులకు గుర్తింపు కార్డులు

- ఎంవి రమణ డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బ్యాండు కళాకారులకు గుర్తింపు కార్డులివ్వాలని వృత్తి సంఘాల సమన్వయ కమిటీ కన్వీనర్ ఎంవి రమణ డిమాండ్ చేశారు. ఈ నెల 16న జరగనున్న బ్యాండ్ వాయిద్య కళాకారుల సంఘం రాష్ట్ర సదస్సు పోస్టర్ ఆవిష్కరణ మంగళవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగింది. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ... గడిచిన పదేండ్లుగా బ్యాండ్ కళాకారులకు బడ్జెట్‌లో తగిన కేటాయింపులు చేయలేదని విమర్శించారు. వారికి గుర్తింపు కార్డులిచ్చి, 50 ఏండ్లకు పైబడిన వారికి వృద్ధాప్య పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఫెడరేషన్ ఏర్పాటు చేసి వారి సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిఎంపిఎస్ రాష్ట్ర కార్యదర్శి ఉడుత రవీందర్, బ్యాండ్ కళాకారుల సంఘం రాష్ట్ర కన్వీనర్ గుమ్మడిరాజు నాగరాజు తదితరులు తదితరులు పాల్గొన్నారు

కెసిఆర్‌తో లేఖ రాయించుకుని చర్చకు రండి

- కెటిఆర్‌కు మంత్రి పొన్నం సవాల్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మాజీ మంత్రి కెటిఆర్‌కు దమ్ముంటే ప్రతిపక్ష నేత కెసిఆర్‌తో లేఖ రాయించుకుని చర్చకు రావాలని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. చర్చకు బిఆర్ఎస్ పార్టీ నుంచి ఎవరొచ్చినా సరే అని తాము సిద్ధమని సవాల్ విసిరారు. మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో పార్టీ నేతలతో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. అసెంబ్లీలో చర్చకు రావాలంటూ సీఎం రేవంత్‌రెడ్డి కోరితే, బిఆర్ఎస్ నేతలు మరెక్కడికో రమ్మంటున్నారని ఎద్దేవా చేశారు. 'అసెంబ్లీలో చర్చకు రండి ఎవరేంటో తెలుస్తుంది. మా ప్రభుత్వం ఏం చేసిందో... బిఆర్ఎస్ సర్కారు ఏం చేసిందో అంతా చర్చిద్దాం' అని సవాల్ విసిరారు. అసెంబ్లీలో చర్చిస్తే అంత రికార్డు అవుతుందని చెప్పారు.

ఆస్పత్రిలోనే చర్చిస్తారా? అసెంబ్లీలో చర్చించరా?

- మాజీ సిఎం కెసిఆర్‌కు ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ప్రశ్న

హైదరాబాద్ బ్యూరో : ప్రజా సమస్యలపై బిఆర్ఎస్ నేతలతో చర్చించేందుకు మాజీ సిఎం కెసిఆర్‌కు సమయం ఉంది...కానీ అసెంబ్లీలో చర్చించేందుకు సమయం లేదని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ఎద్దేవా చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని సిఎల్‌పి కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. బనకచర్ల ప్రాజెక్టుపై అసెంబ్లీలో చర్చించేందుకు భయమెందుకని ప్రశ్నించారు. శాసనసభలో చర్చ కోసం స్పీకర్‌కు లేఖ రాయాలంటూ ఆయన సవాల్ విసిరారు.

ప్రభుత్వ భూమి ప్రయివేట్‌గా ఎలా మారింది

- పేదల గుడిసెలను ప్రయివేట్ వ్యక్తులు ఎలా ఖాళీ చేయిస్తారు
- నాడిచ్చిన హామీని సిఎం రేవంత్ మరిచారా?
- పేదలకు ఇళ్ల స్థలాలు వచ్చే వరకూ పోరాడుతాం : జాన్‌వెస్లీ



బాధితులతో మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వ భూమి ప్రయివేట్ భూమిగా ఎలా మారిందని, పేదల గుడిసెలను ప్రయివేట్ వ్యక్తులు ఎలా ఖాళీ చేయిస్తారని, ఇంత జరుగుతుంటే అధికార యంత్రాంగం ఏం చేస్తోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పేద వారి కష్టంలో ముందుండేది ఎర్రజెండానేనని స్పష్టం చేశారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం గచ్చిబౌలి డివిజన్ గోపన్‌పల్లి గ్రామంలోని పేదల గుడిసెలను కూల్చివేసిన బసవతారక్‌నగర్‌ను మంగళ వారం సిపిఎం బృందం పర్యటించింది. గుడిసెవాసులతో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గుడిసెవాసులు మాట్లాడుతూ.. 40 ఏళ్లుగా ఇక్కడే నివాసం ఉంటున్నామని తెలిపారు. ఎప్పుడూ లేనిది.. ఇప్పుడు ప్రయివేట్ వ్యక్తులు వచ్చి తమపై బెదిరింపులకు పాల్పడుతూ గుడిసెలు ఖాళీ చేయాలని ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ప్రజాప్రతినిధులు సైతం వారికే వత్తాసు పలుకుతున్నారని తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ బృందం బాధితులకు భరోసానిచ్చారు. వారికి ఇళ్ల స్థలాలు దక్కే వరకూ అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా జాన్‌వెస్లీ మాట్లాడుతూ.. 40 ఏళ్లుగా నివాసం ఉంటున్న పేదలను కొంత మంది ప్రయివేట్ వ్యక్తులు కోర్టు పేరుతో ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. ప్రజలపై దౌర్జన్యం చేస్తూ వారిని ఆ స్థలం నుంచి ఖాళీ చేయించే ప్రయత్నం జరుగుతోందని అన్నారు. గత ప్రభుత్వం వీరిని ఖాళీ చేయించాలని ప్రయత్నం చేసినప్పుడు ఆనాటి ప్రతిపక్ష నాయకుడు, నేటి సిఎం రేవంత్‌రెడ్డి ఈ ప్రాంత వాసుల తరపున నిలబడ్డారని తెలిపారు. తాము అధికారంలోకి వస్తే ఈ భూములు ఇక్కడి పేదలకే ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి అవ్వగానే నాటి హామీని మర్చిపోయారా అని ప్రశ్నించారు. నాడిచ్చిన హామీని అమలు చేయాలని సిఎంను డిమాండ్ చేశారు. ప్రయివేట్ వ్యక్తులు పేద ప్రజలను మభ్యపెడుతూ డబ్బులకు లొంగని వారిపై దౌర్జన్యానికి దిగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం కనీసం వారికి అండగా నిలవడంలేదన్నారు. ప్రభుత్వ యంత్రాంగంలో ఉన్న వ్యక్తులే ఇలా ప్రవర్తించడం ఏమాత్రం సరైన విధానం కాదని తెలిపారు. ఇది ప్రభుత్వ స్థలం అని కలెక్టర్ సుప్రీంకోర్టుకి తెలిపారన్నారు. కోర్టు ఎలాంటి జడ్జిమెంట్ ఇవ్వకపోయినా.. తమకు అనుకూలంగా తీర్పు వచ్చిందని ప్రయివేటు వ్యక్తులు ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని తెలిపారు. నిజంగానే కోర్టులో ప్రయివేట్ వ్యక్తులకు అనుకూలంగా తీర్పు వస్తే ఇక్కడున్న ప్రజలను ఖాళీ చేయించే పద్ధతి ఇది కాదన్నారు. 40 ఏళ్లుగా స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్న ప్రజలు ప్రయివేట్ పట్టాలో ఉన్నప్పటికీ అది పేద ప్రజలకే దక్కుతుందని చెప్పారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కలగజేసుకుని బసవతారక్‌నగర్ ప్రజలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సిపిఎం, ఇతర వామపక్ష, ప్రజాతంత్ర సంఘాలను కలుపుకొని పెద్ద ఎత్తున పోరాటం నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర నాయకులు డిజి నర్సింగ్ రావు, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య, కార్యదర్శివర్గ సభ్యులు జగదీష్, నాయకులు కృష్ణ, అతిక్, జార్జ్ కృప, అనిల్, శ్రీనివాస్, జంగయ్య, శివుడు తదితరులు పాల్గొన్నారు.

వేలం పాటలో హౌసింగ్ బోర్డు ప్లాట్లు అమ్మకం

- రూ.8,97,48,600 ఆదాయం
- హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్ విపి గౌతమ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నల్లగొండ-దేవరకొండ రోడ్ హౌసింగ్ బోర్డు కాలనీలోని హెచ్‌ఐజి, ఎంఐజి ప్లాట్లు హాట్ కేకుల్లా అమ్ముడయ్యాయి. మంగళవారం నల్లగొండలో నిర్వహించిన వేలం పాటలో 21 ప్లాట్లు విక్రయించగా రూ.8,97,48,600 ఆదాయం సమకూరినట్టు హౌసింగ్ బోర్డు చైర్మన్ విపి గౌతమ్ ఒక ప్రకటనలో తెలిపారు. వీటిలో పలు ప్లాట్లను నిర్ణయించిన ఆఫ్‌సెట్ ధర కంటే దాదాపు రెట్టింపు ధరతో కొనుగోలు చేశారు. హెచ్‌ఐజి, ఎంఐజీకి చెందిన 27 ప్లాట్ల విక్రయానికి హౌజింగ్ బోర్డు నోటిఫికేషన్ ఇచ్చిన సంగతి తెలిసిందే. వీటి కొనుగోలు కోసం నిర్వహించిన వేలం పాటలో 50 మందికి పైగా కొనుగోలుదారులు పాల్గొన్నారు. చదరపు గజానికి హెచ్‌ఐజి ప్లాట్ ధరను రూ.15 వేలు, ఎంఐజీ స్థలానికి రూ.13 వేలుగా నిర్ణయించారు. వేలంపాటలో హెచ్‌ఐజి ప్లాట్ గరిష్టంగా రూ.28,500 ధర పలికింది. మరో రెండు హెచ్‌ఐజి ప్లాట్లను కొనుగోలుదారులు నిర్దేశిత ఆఫ్‌సెట్ ధర కంటే అధికంగా రూ.25,500, రూ.24 వేలకు తీసుకున్నారు. ఎంఐజికి చెందిన 220 చదరపు గజాల ప్లాట్ గరిష్టంగా రూ.23,500 వరకు ధర పలికింది. అన్ని ప్లాట్లు కనీస ధర కంటే అధికంగా చెల్లించి కొనుగోలు చేయడం విశేషం. ఆ కాలనీలో 4,660 చదరపు గజాల విస్తీర్ణంలోని వివిధ రకాల ప్లాట్లను విక్రయించగా, సగటున ఒక్కో చదరపు గజం స్థలానికి రూ.19,069 ధర పలికింది.


జెసిబితో కూల్చివేస్తున్న హైడ్రా అధికారులు

నలందనగర్‌లో హైడ్రా కూల్చివేతలు

- అడ్డుకున్న పట్టాదారులు, మహిళలు
- జెసిబికి అడ్డుగా పడుకుని నిరసన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ సర్కిల్ జిహెచ్‌ఎంసి పరిధిలోని నలందనగర్‌లో పార్కు స్థలంలో నిర్మించిన అక్రమ కట్టడాలను హైడ్రా అధికారులు భారీ బందోబస్తు మధ్య మంగళవారం కూల్చివేశారు. నలందనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ సభ్యులు తమ పార్కు స్థలం కబ్జాకు గురైందని ఇటీవల హైడ్రా అధికారులకు ఫిర్యాదు చేశారు. క్షేత్రస్థాయిలో పర్యటించిన హైడ్రా అధికారులు వెయ్యి గజాల పార్కు స్థలం కబ్జాకు గురైందని తేల్చారు. దాంతో మంగళవారం ఉదయమే భారీ పోలీస్ బందోబస్తు మధ్య జెసిబిల సాయంతో పార్కు స్థలంలో నిర్మించిన కట్టడాలను కూల్చివేయడం ప్రారంభించారు. అయితే ఆ స్థలం తమదే అని అక్కడున్న పట్టాదారులు హైడ్రా అధికారులతో గొడవకు దిగారు. మహిళలు జేసీబీలకు అడ్డంగా పడుకున్నారు. దాంతో కొద్దిసేపు తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. కూల్చివేతలను అడ్డుకుంటున్న మహిళలను, స్థానిక వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకొని రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. తర్వాత 1000 గజాల స్థలాన్ని పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకొని ఫెన్సింగ్‌ని ఏర్పాటు చేశారు. సుమారు రూ.పది కోట్ల విలువైన పార్కు స్థలాన్ని కాపాడిన హైడ్రా అధికారులను స్థానికులు అభినందించారు.

జిఒ 49పై మంత్రి సీతక్క వైఖరి చెప్పాలి

- మాజీ ఎంపి మాలోత్ కవిత డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జిఒ 49పై మంత్రి సీతక్క వైఖరి చెప్పాలని మాజీ ఎంపి మాలోత్ కవిత డిమాండ్ చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఆదివాసి కార్డును అడ్డం పెట్టుకుని అబద్ధాలు మాట్లాడుతున్నారని ఆరోపించారు. తనకు వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్న జర్నలిస్టులను సైతం తన మనుషులతో కొట్టిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. సొంత పార్టీ నాయకులే ఆమెపై కాంగ్రెస్ అధిష్టానానికి ఫిర్యాదు చేసిన విషయం మరిచిపోరాదని అన్నారు. మావోయిస్టులు సైతం సీతక్క వ్యవహార శైలిపై లేఖ విడుదల చేశారని గుర్తు చేశారు. చేసిన తప్పులను కప్పిపుచ్చుకునేందుకు నీతివంతురాలిగా మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. ఇసుక దందా అక్రమాలపై ముందు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. చవకబారు ప్రచారం కోసం కెటిఆర్‌పై విమర్శలు చేయడం మానుకొని, పాలనపై ద్రుష్టి పెట్టాలని సూచించారు. మీడియా సమావేశంలో జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ, బిఆర్‌ఎస్ నాయకులు సుమిత్రానంద్, రామచంద్రు నాయక్, కీర్తిలత గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బాలికను ఎత్తుకెళ్లిన మహిళ

- ఆలస్యంగా వెలుగులోకి..
- చిన్నారి ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలు ఏర్పాటు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గుర్తుతెలియని మహిళ ఆరేళ్ల చిన్నారిని ఎత్తుకెళ్లిన ఘటన రంగారెడ్డి జిల్లా శంషాబాద్ ఆర్‌జిఐఎ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్టేషన్ హౌస్ ఆఫీసర్ కె బాలరాజు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలం కంచన్‌పల్లి గ్రామానికి చెందిన దంపతులు క్యాత్రమోని లక్ష్మమ్మ, రవి తమ కుటుంబ సభ్యులతో కలిసి శంషాబాద్ కు వలస వచ్చి కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ నెల 1వ తేదీన తన ఇద్దరు కూతుళ్లు కీర్తన (6), అర్చనను తీసుకొని లక్ష్మమ్మ శంషాబాద్ కల్లు కంపౌండ్ వచ్చింది. అక్కడ తన పిల్లలతో పాటు కూర్చొని కల్లు తాగుతుండగా ఒక గుర్తుతెలియని మహిళ కల్లు తాగడానికి వచ్చింది. వారితో ఆ మహిళ మాటలు కలిపి కలుపుగోలుగా మాట్లాడింది. ఈ క్రమంలో ఎవరూ గుర్తించని సమయంలో కీర్తనను వెంట బెట్టుకొని బయటకు వెళ్లిపోయింది. వెంటనే తేరుకున్న లక్ష్మమ్మ తన కూతురు కోసం వెతికింది. కీర్తన కనిపించలేదు. దాంతో తన చిన్న కూతురు అర్చనను తీసుకొని ఇంటికి వెళ్లిపోయింది. కానీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయలేదు. ఇప్పటి వరకు కూతురు ఆచూకీ లభించకపోవడంతో బంధువుల సూచన మేరకు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అక్కడున్న సిసి కెమెరాలు పరిశీలించి.. అనుమానితురాలి ఫోటోలను పోలీసులు విడుదల చేశారు. వారి ఆచూకీ కోసం పోలీసులు స్పెషల్ టీమ్‌లను రంగంలోకి దింపారు.

వేధిస్తున్న భర్తను హతమార్చిన భార్యలు

- జనగామ జిల్లాలో ఘటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇద్దరి భార్యల చేతిలో భర్త హత్యకు గురయిన ఘటన జనగామ జిల్లాలో మంగళవారం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ జిల్లా లింగాలఘనపురం మండలం ఏనబావి గ్రామ శివారు పిట్టలోని గూడెంకు చెందిన కాల్య కనకయ్య (30)కు ఇద్దరు భార్యలు పూలమ్మ, శిరీష ఉన్నారు. మద్యానికి బానిసైన కనకయ్య తరచూ భార్యలతో గొడవ పడుతుండేవాడు. వారిని చిత్రహింసలకు గురిచేసి వేధిస్తుండేవాడు. రెండు నెలల కిందట రెండో భార్య శిరీష తల్లిని హత్య చేసి పరారై తప్పించుకు తిరుగుతున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. కాగా, కనకయ్య అప్పుడప్పుడు గ్రామానికి వస్తూ భార్యలను, స్థానిక గ్రామస్తులను బెదిరించేవాడు. ఈ క్రమంలోనే సోమవారం రాత్రి మరోసారి ఇంటికి చేరుకుని చేతిలో గొడ్డలి పట్టుకుని భార్యలను బెదిరిస్తూ వాగ్వాదానికి దిగాడు. ఇదే సమయంలో కోపోద్రిక్తులైన భార్యలు కనకయ్యకు ఎదురు తిరిగి అదే గొడ్డలితో హతమార్చారు. మధ్యరాత్రి అయ్యాక మృతదేహాన్ని గ్రామ శివారు కెనాల్ కాల్వ సమీపంలో పడేశారు. మంగళవారం ఉదయం వారిద్దరూ స్టేషన్‌ఘన్‌పూర్ పోలీసుల ఎదుట లొంగిపోయారు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించి కేసు దర్యాప్తు చేపట్టారు.

కీలక నగరాల్లో కొనికా క్యాంపెయిన్

హైదరాబాద్: డిజిటల్ ప్రొడక్షన్ ప్రింటింగ్ వ్యాపారంలో దిగ్గజంగా నిలుస్తోన్న కొనికా మినోల్టా బిజినెస్ సొల్యూషన్స్ ఇండియా దేశవ్యాప్తంగా బ్రాండ్ మార్కెటింగ్ చేసేందుకు మరోసారి ముందుకొచ్చినట్లు పేర్కొంది. ఈ దఫా మెట్రో రైళ్లలో క్యాంపెయినింగ్ చేయాలని నిర్ణయించు కున్నట్లు తెలిపింది. ఇందుకోసం హైదరాబాద్, ఢిల్లీ, ముంబయి, బెంగళూరు, చెన్నయ్, కొల్‌కత్తా లాంటి ఆరు నగరాలను ఎంచుకున్నట్లు వెల్లడించింది.

సురారంలో కొత్త షోరూం తెరిచిన ప్యూర్ ఇవి

హైదరాబాద్ : మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలోని సూరారంలోని ఎస్‌బిఐ బ్యాంక్ ఎదురుగా కొత్త షోరూం తెరిచినట్లు ప్యూర్ ఇవి వెల్లడించింది. అసమానమైన ఎలక్ట్రిక్ రైడింగ్ అనుభవాన్ని అందించడానికి తమ సంస్థ సిద్దంగా ఉందని పేర్కొంది. వచ్చే 30 నెలల్లో దేశ వ్యాప్తంగా 250 కొత్త డీలర్‌షిప్‌ల ను తెరవడం ద్వారా 320కి విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొంది.

నకిలీ మందుల వ్యవహారంలో మనీష్ కుమార్ అరెస్ట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సన్ ఫార్మా ల్యాబోరేటరీస్ లిమిటెడ్ తయారీ పేరుతో నకిలీ మందులు విక్రయిస్తున్నందుకు ఔషధాల డీలర్ మనీష్ కుమార్‌ను డ్రగ్ కంట్రోల్ అధికారులు అరెస్ట్ చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు లెవిపిల్ 500 టాబ్లెట్లకు సంబంధించి నకిలీ మందులు అర్విండ్ ఫార్మా డిస్ట్రిబ్యూటర్స్ ప్రాంగణంలో స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లోని గాంధీనగర్, ఎస్‌బిఐ స్టాఫ్ కాలనీలో గల అర్విండ్ ఫార్మా డిస్ట్రిబ్యూటర్స్ పాట్నర్ కమ్ కాంపిటెంట్ పర్సన్ మనీశ్ కుమార్‌ను పోలీసుల అరెస్ట్ చేసి నాంపల్లి కోర్టులోని 10వ అడిషనల్ చీఫ్ జుడిషియల్ మెజిస్ట్రేట్ ముందు హాజరు పరచారు. ఈ నెల 23 వరకు కోర్టు రిమాండ్ విధించింది. ఈ కేసుకు సంబంధించి విచారణ కొనసాగుతోంది.

హైదరాబాద్‌లో బాంబు బెదిరింపుల కలకలం

- సిటీ సివిల్ కోర్టులో తనిఖీలు
- ఫేక్ అని తేల్చిన పోలీసులు



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాల్లో బాంబులు పెట్టినట్టు మంగళవారం బెదిరింపు మెయిల్స్ రావడంతో పోలీస్ అధికారులు అప్రమత్తమయ్యారు. రాజ్‌భవన్, పాతబస్తీలోని సిటీ సివిల్ కోర్టు, జింఖానా క్లబ్, సికింద్రాబాద్ సివిల్ కోర్టుల్లో బాంబులు పెట్టినట్టు గుర్తు తెలియని వ్యక్తి మెయిల్ చేశాడు. దాంతో అప్రమత్తమైన పోలీసులు ఆయా ప్రాంతాల్లో బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహించారు. పాతబస్తీలోని సిటీ సివిల్ కోర్టులో కార్యకలాపాలు పూర్తిగా నిలిపివేశారు. పోలీస్ బలగాలు న్యాయవాదులను, కోర్టు సిబ్బందిని బయటకు పంపగా డాగ్ స్క్వాడ్, బాంబు స్కాడ్, క్లూస్ టీమ్‌లోనికి వెళ్లి ప్రధాన భవనంతోపాటు ప్రాంగణంలోని అన్ని భవనాలనూ తనిఖీలు చేశారు. ఎలాంటి బాంబు లభించకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఇతర చోట్ల కూడా ఏమీ దొరకలేదు. దాంతో అవి ఫేక్ మెయిల్స్ అని పోలీసులు తేల్చారు. అన్నా వర్సిటీ పూర్వ విద్యార్థుల పేరుతో మంగళవారం తెల్లవారుజామున 3.43 గంటల సమయంలో ఆగంతకుడు మెయిల్ పంపినట్టు గుర్తించారు. నగరం సేఫ్‌గా ఉందని, వదంతులను నమ్మొద్దని పోలీసులు సూచించారు.

నూతన క్రిమినల్ చట్టాల అమలు భేష్

- కేంద్ర హోంశాఖ కార్యదర్శి గొంవిద్ మోహన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్రం తీసుకొచ్చిన నూతన క్రిమినల్ చట్టాలు రాష్ట్రంలో సక్రమంగా అమలు జరుగుతున్నాయని కేంద్ర హోంశాఖ కార్యదర్శి గొంవిద్ మోహన్ ప్రశంసించారు. మంగళవారం ఆయన నేతృత్వం లో ఎన్‌ఆర్‌బి, బిపిఆర్ అండ్ డీ ఎన్‌ఐసికి చెందిన అధికారుల బృందం రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులతో సమావేశమైంది. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణరావు, హోంశాఖ ముఖ్య కార్యదర్శి రవిగుప్త, డిజిపి జితేందర్, ఇంటిలిజెన్స్ చీఫ్ శివదర్‌రెడ్డితో పాటు పలువురు ఐపిఎస్ అదికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్రం తీసుకు వచ్చిన బిఎన్‌ఎస్‌ఎస్, బిఎన్‌ఎస్, బిఎస్‌ఎ నూతన క్రిమినల్ చట్టాల అమల్లో ఏమైనా సమస్యలు ఎదురవుతున్నాయా? వాటి ఫలితాలు ఎలా ఉన్నాయి? తదితర అంశాలపై కేంద్ర అధికారుల బృందం చర్చించింది. ఈ సందర్భంగా డిజిపి జితెందర్ మాట్లాడుతూ.. కేంద్రం తీసుకువచ్చిన చట్టాలపై రాష్ట్రంలోని ఐపిఎస్ అధికారులు మొదలుకుని కింది స్థాయి సిబ్బంది వరకు అవగాహన కల్పించడం జరిగిందని తెలిపారు.

రచ్చ తప్ప చర్చ తెలియని సిఎం

- సవాలు విసిరి పారిపోయిన రేవంత్ రెడ్డి : కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



రచ్చ చేయడమే తప్ప చర్చించడం తెలియని సిఎం రేవంత్ రెడ్డి అని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ విమర్శించారు. రైతులు, యువతకు ఎవరేం చేశారో చర్చించాలంటూ సవాల్ విసిరిన ముఖ్యమంత్రి ఢిల్లీ పారిపోయారని ఎద్దేవా చేశారు. మరోసారి అవకాశమిస్తున్నా ననీ, సమయం, స్థలం, తేదీ తానే నిర్ణయించి చర్చకు సిద్ధం కావాలన్నారు. చర్చించేందుకు సిద్ధంగా లేకుంటే వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బూతులు మాట్లాడ టమే తప్ప రైతుల గురించి రేవంత్ రెడ్డికి మాట్లాడటం రాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులపై చర్చించాలని సీఎం రేవంత్ రెడ్డి విసిరిన సవాల్‌ను స్వీకరించి కెటిఆర్ మంగళవారం హైదరాబాద్‌లోని సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌కు వచ్చారు. వందలాది మంది అనుచరులు ఆయనను అనుసరించడంతో క్లబ్ గులాబీ శ్రేణులతో నిండిపోయింది. ఈ సందర్భంగా గౌరవ ముఖ్యమంత్రి అని రాసి ఉన్న ఖాళీ కుర్చీని వేదికపై ఉంచారు. ఆ పక్కన కుర్చీలో కెటిఆర్ కూర్చుకున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో 600 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని విచారం ప్రకటిస్తూ బిఆర్‌ఎస్ నేతలు ఒక నిమిషం మౌనం పాటించారు.

ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ 18 నెలలుగా 70 లక్షల మంది రైతులను, కోట్లాది కుటుంబాలను కాంగ్రెస్ దగా చేసిందని మండిపడ్డారు. హామీల అమలుకు గ్యారంటీ అంటూ నమ్మబలికి 18 నెలల తర్వాత కూడా ఒక్క హామీని నెరవేర్చలేదని తెలిపారు. రైతులు బేసిన్ల గురించి కనీస పరిజ్ఞానం లేకుండా సిఎం మాట్లాడుతున్నారని, అందుకే సిద్ధపడేందుకు 72 గంటల సమయమిచ్చినట్టు తెలిపారు. స్థలం, సమయం, తేదీ ముఖ్యమంత్రి ఇష్టానికే వదిలేసినట్టు చెప్పారు. అటు నుంచి సమాధానం రాకపోవడంతో సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌కు జులై 8న ఉదయం 11 గంటలకు తాము వస్తున్నామనీ, అక్కడే చర్చకు రావాలని కోరినట్టు తెలిపారు. సిఎం రాలేకపోయినా సరే... ఆయన పక్షాన ఉప ముఖ్యమంత్రి గానీ, వ్యవసాయశాఖ మంత్రి గానీ, లేకపోతే ఎవరైనా మంత్రులు వచ్చినా తాము చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

సిఎం రేవంత్ రెడ్డి నీళ్లు, నియామకాలు, నిధులను తెలంగాణ ప్రయోజనాలకు వ్యతిరేకంగా ముఖ్యమంత్రి ఉపయోగిస్తున్నారని కేటీఆర్ విమర్శించారు. బకనచర్లకు పచ్చజెండా ఊపుతూ, కృష్ణా నీటిని ఆంధ్రకు తరలిస్తే రేవంత్ రెడ్డి కళ్లు మూసుకున్నారని మండిపడ్డారు. రైతుభరోసా, రైతు రుణమాఫీ దక్కని రైతుల జాబితాలు, ఆత్మహత్య చేసుకున్న రైతుల వివరాలు, బోనస్ రాక మిల్లర్లకు అమ్ముకుని నష్టపోయిన రైతుల జాబితాలతో తాను చర్చించేందుకు వచ్చినట్టు చెప్పారు. గత కాంగ్రెస్ పాలన నాటి రోజులను మళ్లీ తెచ్చారనీ, రాష్ట్రంలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

మాట తప్పడం రేవంత్ రెడ్డికి అలవాటు

మాట తప్పడం, పారిపోవడం సిఎం రేవంత్ రెడ్డికి అలవాటేనని కేటీఆర్ ఎద్దేవా చేశారు. 2018లో కొడంగల్‌లో ఓడితే రాజకీయ సన్యాసం తీసుకుంటాననీ, ఎంపి ఎన్నికల్లో పోటీ చేశారని తెలిపారు. జిహెచ్‌ఎంసిలో బిఆర్‌ఎస్ సొంతగా గెలిస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటానని మరోసారి మాట తప్పి పారిపోయారని గుర్తుచేశారు. సోషల్ మీడియాలో పిల్లలు పోస్టు పెడితే గజగజ వణికిపోయే సిఎం రేవంత్ రెడ్డితో చర్చించేందుకు కెసిఆర్ అవసరం లేదనీ, బిఆర్‌ఎస్‌లో ఏ నాయకుడైనా సరిపోతాడన్నారు. అసెంబ్లీలో మైక్ ఇవ్వకుండా కాలక్షేపం చే స్తున్నారని ప్రజలు గమనిస్తున్నారని హెచ్చరించారు.



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న జస్టిస్ చంద్రకుమార్

విష సంస్కృతి విలయతాండవం

- కళలను ప్రోత్సహించాలి : జస్టిస్ చంద్రకుమార్
- 10 రోజులు జానపద కళల జనజాతర : ఎమ్‌డి అబ్బాస్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ పోరాట గడ్డపై విష సంస్కృతి విలయతాండవం చేస్తోందని, దాన్నుంచి ప్రజలను రక్షించేందుకు.. వారిని చైతన్యవంతం చేసేందుకు కళలను ప్రోత్సహించాలని మాజీ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ ప్రభుత్వాన్ని కోరారు. హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మంగళవారం తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం ఆధ్వర్యంలో "తెలంగాణ సమగ్ర సాంస్కృతిక విధానం"పై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పిల్లల నుంచి పెద్దల వరకు విష సంస్కృతికి బానిసలవుతున్నారని, దీనికి కాషాయం, కార్పొరేట్ శక్తులు కారణమవుతున్నాయని తెలిపారు. ప్రభుత్వం తక్షణమే జానపద అకాడమీ, బాలల సాహిత్య అకాడమీ, లలితకళల అకాడమీ, సంగీత నృత్య అకాడమీ, ఫొటోగ్రఫీ అండ్ చిత్రకళల అకాడమీలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రత్యేక అధికారిని నియమించి నిధులు, విధులు సమకూర్చాలని డిమాండ్ చేశారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రం కార్యదర్శి ఎస్ వినయకుమార్ మాట్లాడుతూ.. రాజ్యాంగ విలువలను కళాయాత్రల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఓటు విలువ, సమాజం పట్ల బాధ్యత వంటి అంశాలపై కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. కులాంతర వివాహాలు చేసుకున్న వారికి రక్షణ కల్పించి.. వాటిని ప్రోత్సహించాలని కోరారు. ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎండి అబ్బాస్ మాట్లాడుతూ.. 11 ఏళ్లుగా తెలంగాణ కళాకారులకు సరైన గుర్తింపు, వృద్ధాప్య భృతి, ఉచిత ప్రయాణం, డబుల్ బెడ్ రూం ఇల్లు వంటి మౌలిక సౌకర్యాలు అందడం లేదన్నారు. ఆగస్టు 22న జానపద దినోత్సవాన్ని పురస్కరించుకుని పల్లె నుంచి పట్నం వరకు పది రోజులు జానపద కళల జనజాతర నిర్వహించాలని ప్రభుత్వాన్ని కోరారు. పుష్ప, రజాకార్ లాంటి సినిమాలను ప్రోత్సహించడమంటే విష సంస్కృతిని, స్మగ్లర్లను ప్రోత్సహించడమే అవుతుందని అన్నారు. ఈ కార్యక్రమానికి జి రాములు అధ్యక్షత వహించగా.. టిపిఎస్‌కె రాష్ట్ర అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు సమగ్ర సాంస్కృతిక విధానానికి నోట్ ప్రతిపాదించారు. తెలంగాణ సమగ్ర సాంస్కృతిక విధానంపై తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం ప్రతిపాదనలను జులై 18న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అందజేయాలని, జిల్లాల్లో చైతన్య కార్యక్రమాలు నిర్వహించాలని ఈ సమావేశంలో నిర్ణయించుకున్నారు. విజ్ఞానదర్శిని రమేష్, పిఎన్ మూర్తి, సాంబరాజు, యాదగిరి, అరుణోదయ రాకేష్ రజినీ, రాధిక, శ్రీలక్ష్మీ నృత్య గురువులు, సుందరయ్య విజ్ఞాన కేంద్రం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కదం తొక్కనున్న కార్మికులు

- లేబర్ కోడ్‌ల కోసం నేడు సమ్మె సైరన్
- కలిసి రానున్న రైతులు, వ్యవసాయ కార్మికులు
- హైదరాబాద్‌లో ఎస్‌వికె నుంచి ఇందిరా పార్కు వరకు మహాప్రదర్శన
- పెద్ద ఎత్తున పాల్గొననున్న సంఘటిత, అసంఘటిత కార్మికులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

లేబర్ కోడ్‌ల రద్దు కోరుతూ..ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ...కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ.. పనిగంటల పెంపును ఖండిస్తూ బుధవారం దేశవ్యాప్తంగా కార్మికులు సమ్మె సైరన్ మోగించనున్నారు. కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు లక్షలాది కార్మికులు ఎక్కడికక్కడ మోడీ సర్కారుపై నిరసనల బాణాన్ని ఎక్కుపెట్టనున్నారు. కార్మిక, కర్షక మైత్రిలో భాగంగా వ్యవసాయ కార్మికులు, రైతులు ఈ సమ్మెలో భాగస్వామ్యం పంచుకోనున్నారు. పారిశ్రామిక ప్రాంతాల్లో కార్మికుల సమ్మె సైరన్‌తో పరిశ్రమలల్లో ఉత్పత్తి ఆగిపోనున్నది. ఈ సమ్మెలో సంఘటిత కార్మికులు, అసంఘటిత కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొననున్నారు.

హైదరాబాద్‌లోని బాగ్‌లింగంపల్లిలో గల సుందరయ్య విజ్ఞాన కేంద్రం (ఎస్‌వికె) నుంచి ఇందిరాపార్కు ధర్నా చౌక్ వరకు కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మహా ప్రదర్శన చేపట్టనున్నారు. ఆయా సంఘాల ముఖ్యనేతలు ఈ ప్రదర్శనలో పాల్గొననున్నారు. అదే సమయంలో హైదరాబాద్‌లోనే ఐఎస్ సదన్ చౌరస్తా నుంచి ఒవైసీ ఆస్పత్రి వరకు వేలాది మంది కార్మికులతో ప్రదర్శన చేయనున్నారు. జిల్లా, మండల, పారిశ్రామిక కేంద్రాల్లో, ఊర్లల్లో ఎక్కడికక్కడ ప్రదర్శనలు, సభలు నిర్వహించనున్నారు. నేషనల్ మానిటైజేషన్ పైప్‌లైన్ (ఎన్‌ఎంపి)లో భాగంగా ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణ, వాటాలు, భూముల అమ్మకాలను నిరసిస్తూ సింగరేణి, బిడిఎల్, బెల్, డిఇఎల్, మిధాని, హాల్, తదితర కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లోని కార్మికులు, ఉద్యోగులు కూడా తమ విధులను బహిష్కరించి బుధవారం నాటి సమ్మెలో పాల్గొనబోతున్నారు. రవాణా రంగంలోని కార్మికులు కూడా పెద్ద ఎత్తున సమ్మెలో పాలుపంచుకోనుండటంతో ప్రభుత్వ, ప్రయివేటు ట్రాన్స్‌పోర్టు వాహనాలు నిలిచిపోనున్నాయి. ఆర్టీసీలోని 13 కార్మిక సంఘాలు ఒక్కతాటిపైకి వచ్చి ఏర్పడిన జెఎసి సమ్మెకు మద్దతు ప్రకటించిన విషయం విదితమే. ప్రభుత్వం, ఉన్నతాధికారుల నుంచి ఒత్తిడి ఉన్నప్పటికీ ఆర్‌టిసి కార్మికులు పది నుంచి పదిహేను వేల మంది సమ్మెలో పాల్గొనే అవకాశముంది. వ్యవసాయ కార్మికులు, రైతులు గ్రామీణ బంద్‌ను నిర్వహించనున్నారు. స్కీమ్ వర్కర్లు కూడా తమ విధులను బహిష్కరించి నిరసన కార్యక్రమాల్లో ఎక్కడికక్కడ పాల్గొననున్నారు.

ప్రధాన డిమాండ్లు ఇవే..

- నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి. - కనీస వేతనం రూ.26 వేలను నిర్ణయించి కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి. - ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణను ఆపాలి. - పని హక్కును ప్రాథమిక హక్కుగా గుర్తించాలి. - సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలి. పని గంటల పెంపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి. - నెలకు కనీస పెన్షన్ రూ. తొమ్మిది వేలు ఇవ్వాలి. అసంఘటిత కార్మికులు, వ్యవసాయ కార్మికులతో సహా అన్ని తరగతుల కార్మికులకు సామాజిక భద్రత కల్పించాలి. - అవుట్‌సోర్సింగ్, ఫిక్స్‌డ్ టర్మ్ ఎంప్లాయ్‌మెంట్, అప్రెంటీస్‌లు, ట్రైనీలు, వంటి రూపాల్లో వివిధ పథకాల కింద పనిచేస్తున్న కార్మికులెవ్వరినీ క్యాజువలైజ్ చేయరాదు. - పాత పెన్షన్ పథకాన్ని పునరుద్ధరించాలి. ఎన్‌పిఎస్, యుపిఎస్‌ను రద్దు చేయాలి. - రైతుల డిమాండ్ మేరకు కనీస మద్దతు ధరల గ్యారెంటీ చట్టం తేవాలి.- వెల్ఫేర్ ఫండ్ నిధులతో భవన, ఇతర నిర్మాణ కార్మికులు ఈఎస్ఐ సౌకర్యాన్ని కల్పించాలి. - సంపన్నులపై సంపద, వారసత్వ పన్నులను తిరిగి ప్రవేశపెట్టి వాటిని పెంచాలి. - అటవీ హక్కుల చట్టాన్ని కఠినంగా అమలు చేయాలి. - ప్రతి ఒక్కరికీ ఉచిత విద్య, ఉచిత వైద్యం, తాగునీటి సౌకర్యాన్ని కల్పించాలి. - నూతన విద్యావిధానాన్ని రద్దు చేయాలి. - విద్యుత్ సవరణ బిల్లును వెనక్కి తీసుకోవాలి. విద్యుత్ రంగ ప్రయివేటీకరణను ఆపాలి. - నిత్యావసర సరుకుల ధరలను నియంత్రించాలి. ఆహార భద్రత చట్టానికి గ్యారెంటీ ఇవ్వాలి.